RNI NO: APTEL/26/A7632

మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 48 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 4 వెల రూ. 2, శనివారం -24 - అక్టోబర్ - 2026

Published From : Guntur circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Anatapuram I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

2లో

రేకుల షెడ్డు కింద చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్

- అల్లూరి జిల్లాలో రేకుల షెడ్డు కింద విద్యార్థుల చదువులు
- డూంబ్రిగూడ మండలానికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- పాఠశాల భవనాన్ని తక్షణమే బాగుచేయాలని అధికారులకు ఆదేశం

అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల

ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలక సమావేశం

చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు

రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు చంద్రబాబుపై జగన్ ఫైర్

2లో

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

2లో

గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో గ్యాస్ లీక్ ప్రమాదం

ఇద్దరు కార్మికుల దుర్మరణం

సిగాచీ ఘటన నుంచి ప్రభుత్వం గుణపాఠం

2లో

రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి: ప్రభుత్వ విప్ బొండా ఉమ

స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ

2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ

2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం

2లో

'మెసేజ్ అందింది'.. జైలు వ్యాఖ్యలకు ఎలాన్ మస్క్ కౌంటర్

డెమొక్రాట్లు గెలిస్తే మస్క్ జైలుకు వెళ్తారన్న జర్నలిస్ట్

జర్నలిస్ట్ కారా స్విషర్‌కు ఘాటుగా కౌంటర్ ఇచ్చిన మస్క్

ఎన్నికలను కొనుగోలు చేస్తున్నారంటూ మస్క్‌పై బెర్నీ శాండర్స్ విమర్శలు

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- ఈ వివాదంతో తన కుమారుడ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ
- రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్

ఢిల్లీ: కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ మిగతా 2 లో

62 ఏళ్ల అమిత్ షా: డయాబెటిస్‌పై విజయం.. ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఇదే!

జీవనశైలి మార్పులతో 20 కిలోలకు పైగా బరువు తగ్గిన వైనం

- నిద్ర, ఆహారం, వ్యాయామంతో డయాబెటిస్‌ను నియంత్రించుకున్నట్లు వెల్లడి
- నాలుగున్నరేళ్లుగా మందులు, ఇన్సులిన్ వాడటం లేదని గతంలో తెలిపిన షా
- వైద్యుల సలహా లేకుండా మందులు మానవద్దని నిపుణుల హెచ్చరిక

ఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న 62వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా తన జీవనశైలిలో మార్పులు చేసుకుని, మిగతా 2 లో

2లో

ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

- హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులు కల్పించనున్న సర్కార్

మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

ఆ వ్యక్తి పేరును, స్టింగ్ ప్రయత్నానికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టని డీకే

- కర్ణాటక సీఎం డీకే శివకుమార్
- పారిశ్రామికవేత్త మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించడం అనుమానాలకు కారణమైందని వెల్లడి
- మంత్రులను ఇరికించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు వెల్లడి
- సిద్ధరామయ్యకు సంబంధించిన స్టింగ్ వీడియోలపై కర్ణాటకలో రాజకీయ వివాదం



కర్ణాటక: తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు. మిగతా 2 లో

2లో

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

హైదరాబాద్: దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని,

‘మెసేజ్ అందింది’.. జైలు వ్యాఖ్యలకు ఎలాన్ మస్క్ కౌంటర్

ఢిల్లీ: టెస్లా, ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. అమెరికాలో డెమొక్రాట్లు అధికారంలోకి వస్తే ఆయన జైలుకు వెళ్లాల్సి రావొచ్చని ప్రముఖ టెక్ జర్నలిస్ట్ కారా స్విషర్ చేసిన వ్యాఖ్యలపై మస్క్ స్పందించారు. కేవలం రెండే రెండు పదాల్లో ‘మెసేజ్ అందింది’ అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రముఖ టెక్నాలజీ జర్నలిస్ట్, పాడ్‌కాస్టర్ అయిన కారా స్విషర్, “బుల్వార్క్ పాడ్‌కాస్ట్”లో మాట్లాడుతూ ఎలాన్ మస్క్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ 2026 మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు కాంగ్రెస్‌లోని సెనేట్, ప్రతినిధుల సభను తిరిగి చేజిక్కించుకుంటే మస్క్ తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మస్క్ కంపెనీలపై విచారణలు ఆగిపోయాయని, డెమొక్రాట్లు అధికారంలోకి వస్తే అవి తిరిగి ప్రారంభమవుతాయని ఆమె జోస్యం చెప్పారు. “ఒకవేళ కమలా హారిస్ అధికారంలో ఉండి ఉంటే, మస్క్ బహుశా ఇప్పటికే జైల్లో ఉండేవారు. ఏం జరగబోతోందో ఆయనకు తెలుసు. విధి ఆయనను వెతుక్కుంటూ వస్తోంది, అది కూడా చాలా బలంగా” అని స్విషర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మొదట ‘మెసేజ్ అందింది’ అని స్పందించిన మస్క్, ఆ తర్వాత మరో ఘాటైన పోస్ట్ చేశారు. “కత్తితో బతికేవాడు కత్తికే చస్తాడు. ఈ మాటలు చూస్తుంటే స్విషర్ నిజంగా జైలుకు వెళ్లాలనుకుంటున్నట్లుంది” అని కౌంటర్ ఇచ్చారు. మరోవైపు అమెరికా సెనేటర్ బెర్నీ శాండర్స్ కూడా ఎలాన్ మస్క్‌పై విమర్శలు గుప్పించారు. మధ్యంతర ఎన్నికల కోసం మస్క్ తన సూపర్ పీఏసీల ద్వారా 400 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేస్తున్నారని, ఇది “మధ్యంతర ఎన్నికలను కొనుగోలు చేసే ప్రయత్నమే” అని ఆయన ఆరోపించారు.

ఏఐతో మానవాళికి ముప్పు..
గూగుల్ మాజీ సైంటిస్ట్ హెచ్చరిక!

ఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానవాళికి వరమా లేక శాపమా అనే చర్చ తీవ్రంగా జరుగుతున్న వేళ, దీనిపై నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న ‘ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026’లో ఈ అంశంపై కీలక చర్చ జరిగింది. ఏఐ వల్ల “అదుపు చేయలేని మేధో విస్ఫోటనం” సంభవించే ప్రమాదం ఉందని గూగుల్ డీప్‌మైండ్ మాజీ పరిశోధకుడు అలెక్స్ టర్నర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సదస్సులో “మానవాళిని ఏఐ తుడిచిపెట్టేస్తుందా?” అనే అంశంపై జరిగిన చర్చలో అలెక్స్ టర్నర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, “ఏఐతో మనం ఎంతో ప్రయోజనం పొందవచ్చు. కానీ, ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేసే ‘అదుపులేని మేధో విస్ఫోటనాన్ని’ మనం నిరోధించాలి. ఇందుకోసం అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థల అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి” అని సూచించారు. అయితే, ఇదే సదస్సులో పాల్గొన్న మరో ప్రముఖ ఏఐ నిపుణుడు ఆండ్రూ ఎన్జీ కూడా స్పందించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే భయాలు అతిశయోక్తి అని ఆయన అన్నారు. “నిజాయతీగా చెప్పాలంటే, ఏఐ ఇంకా అంత మెరుగ్గా పనిచేయడం లేదు. చాలా ఉద్యోగాలను నాశనం చేసేంత సామర్థ్యం దానికి ఇంకా రాలేదు. కాబట్టి కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ ఉంటే ఉద్యోగాలకు ఢోకా ఉండదు” అని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల కాలంలో మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్‌తో పాటు ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి సంస్థల అధినేతలు కూడా ఏఐ భద్రతపై ఆందోళనలు వ్యక్తం చేయడం గమనార్హం. ఎన్డీటీవీ కథనాల ప్రకారం.. ఏఐ సామర్థ్యాలు, దాని నియంత్రణపై ప్రపంచవ్యాప్తంగా నిపుణుల మధ్య చర్చ ముమ్మరంగా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

బంగ్లాదేశ్ జైళ్లలో మగ్గుతున్న భారతీయులు..
శిక్ష పూర్తయినా విడుదలలో జాప్యం

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని వివిధ జైళ్లలో డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, బంగారం స్మగ్లింగ్ వంటి తీవ్రమైన నేరారోపణలపై 407 మంది విదేశీయులు శిక్ష అనుభవిస్తున్నారు. వీరిలో సగానికి పైగా భారతీయులే ఉండటం గమనార్హం. శిక్షాకాలం పూర్తయినప్పటికీ, గణనీయమైన సంఖ్యలో భారతీయులు ఇంకా జైళ్లలోనే మగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ‘ది డైలీ స్టార్’ కథనం ప్రకారం, ఆ దేశంలోని వివిధ జైళ్లలో మొత్తం 238 మంది భారతీయ ఖైదీలు ఉన్నారు. వీరిలో 168 మంది ఇప్పటికే తమ శిక్షాకాలాన్ని పూర్తి చేసుకున్నప్పటికీ, స్వదేశానికి పంపే ప్రక్రియలో జాప్యం కారణంగా వారు ఇంకా నిర్బంధంలోనే కొనసాగుతున్నారు. అయితే, ఈ గణాంకాలపై ఢాకాలోని భారత హైకమిషన్ భిన్నమైన వివరణ ఇచ్చింది. శిక్షాకాలం ముగిసి, స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ధ్రువీకరించబడిన భారతీయుల సంఖ్య కేవలం 25 మాత్రమేనని హైకమిషన్‌లోని కాన్సులర్ వింగ్ అధికారి ఒకరు స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ మొత్తం 121 మంది ఖైదీల జాబితాను పంపినప్పటికీ, అందులోని పలువురి వ్యక్తిగత వివరాలు అసంపూర్ణంగా ఉండటంతో జాతీయతను నిర్ధారించడం సవాలుగా మారిందని ఆయన పేర్కొన్నారు. సదరు ఖైదీలను కలిసేందుకు అనుమతి కోరామని, బంగ్లా విదేశాంగ శాఖ స్పందన కోసం వేచి చూస్తున్నామని ఆయన వివరించారు. భారతీయుల తర్వాత మయన్మార్‌కు చెందిన వారు 133 మందితో రెండో స్థానంలో ఉన్నారు. వీరితో పాటు నైజీరియాకు చెందిన ఆరుగురు, పాకిస్థాన్, మలేషియా దేశాలకు చెందిన వారు ముగ్గురు చొప్పున బంగ్లా జైళ్లలో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా విదేశీ ఖైదీలను ప్రత్యేక సెల్‌లలో ఉంచి, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శిక్ష పూర్తయినప్పటికీ ఖైదీలు విడుదల కాకపోవడంతో నిర్వహణాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇది ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోందని జైలు అధికారులు చెబుతున్నారు.

నేడు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం. నేడు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

కిమ్ జాంగ్ ఉన్ బతికే ఉన్నాడు.. వదంతులపై స్పష్టతనిచ్చిన ఎన్ఐఎస్

ఢిల్లీ: ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ ఆరోగ్యంపై గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని దక్షిణ కొరియా స్పష్టం చేసింది. కిమ్ తీవ్ర అనారోగ్యంతో కోమాలోకి వెళ్లి మరణించారంటూ వ్యాపించిన వార్తలన్నీ అవాస్తవాలని దక్షిణ కొరియా జాతీయ గూఢచార సంస్థ తేల్చి చెప్పింది. ఈ మేరకు పార్లమెంటరీ ఇంటెలిజెన్స్ కమిటీతో జరిగిన రహస్య సమావేశంలో ఎన్ఐఎస్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమావేశంలో పాల్గొన్న సభ్యులు తెలిపారు. కిమ్ జాంగ్ ఉన్ తీవ్రమైన బ్రెయిన్ హెమరేజ్‌కు గురయ్యారని, కోమాలోకి వెళ్లారని, చివరకు మరణించారంటూ విదేశీ సోషల్ మీడియాలో పుకార్లు వేగంగా వ్యాపించాయి. కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఈ వార్తలను ప్రసారం చేశాయి. అయితే, ఈ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని యోన్‌హాప్ న్యూస్ ఏజెన్సీ తన కథనంలో పేర్కొంది. ఈ వదంతులపై ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా నేరుగా స్పందించనప్పటికీ, వాటికి చెక్ పెడుతూ కిమ్‌కు సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది. ప్యాంగ్యాంగ్‌లో జరిగిన వస్త్ర, పాదరక్షల ప్రదర్శనలో కిమ్ తన కుమార్తె జు ఏతో కలిసి పాల్గొన్నారని, ఆ ఫోటోలను మంగళవారం ప్రచురించింది. గత నెలలో కూడా ఎన్ఐఎస్ కిమ్ ఆరోగ్యంపై నివేదిక ఇచ్చింది. కిమ్ 140 కిలోలకు పైగా బరువుతో తీవ్రమైన ఊబకాయంతో బాధపడుతున్నారని, దీనివల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉందని, అయితే ప్రస్తుతం ఆయనకు గుర్తించదగిన ఆరోగ్య సమస్యలేవీ లేవని తెలిపింది. ఆయన చురుగ్గా కదులుతున్నారని, ఓ నౌకను తనిఖీ చేసేటప్పుడు మెట్లు కూడా వేగంగా ఎక్కారని గుర్తు చేసింది. ఆయన ఆరోగ్యాన్ని ప్రత్యేక వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని వివరించింది. ఇదే సమావేశంలో కిమ్ సోదరి, వర్కర్స్ పార్టీ సీనియర్ అధికారి కిమ్ యో జోంగ్ కార్యకలాపాలపై కూడా ఎన్ఐఎస్ నివేదిక ఇచ్చింది. దక్షిణ కొరియా సరిహద్దు వెంబడి జరుగుతున్న సైనిక నిర్మాణాలను ఆమె రక్షణ శాఖ సలహాదారు పాక్ జోంగ్ చోన్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు “రెండు శత్రు దేశాల” వంటివని కిమ్ ప్రకటించిన నేపథ్యంలో, ఏప్రిల్ 2024 నుంచి ఉత్తర కొరియా తమ సరిహద్దులను బలోపేతం చేసుకుంటోంది. ఈ క్రమంలో, దక్షిణ కొరియాపై మళ్లీ ప్రచార లౌడ్‌స్పీకర్లను పునఃప్రారంభిస్తామని, “భయంకరమైన, బాధాకరమైన పరిస్థితి”ని ఎదుర్కోవాల్సి వస్తుందని కిమ్ సోదరి యో జోంగ్ హెచ్చరించినట్లు ఎన్ఐఎస్ పేర్కొంది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: చంద్రబాబుపై జగన్ ఫైర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్.. బీజేపీ సంచలన ఆరోపణలు

ఢిల్లీ: కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. ‘నో ఐడియా ఈజ్ ఫైనల్’ పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు. మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ.. యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది. అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే
రోజులు వస్తున్నాయి: కేటీఆర్

హైదరాబాద్: దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలక సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం:

కర్ణాటక: తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు. ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు. అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు. “ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు” అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు. “మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది” అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు. కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించినట్లు చెబుతున్న స్టింగ్ వీడియోల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో డీకే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2011 నాటి వీడియోలను ఉపయోగించి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. అయితే సిద్ధరామయ్యను తొలగించేందుకు స్టింగ్ ఆపరేషన్ చేయించారన్న ఆరోపణలను డీకే ఖండించారు. కాంగ్రెస్ కూడా విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చింది. అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం. సుమారు పది మంది మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు ఓ కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నేత ప్రైవేటు ఏజెన్సీకి నిధులు సమకూర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గణిగ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు. మరోవైపు, వివాదాస్పద వీడియోల ప్రసారాన్ని అడ్డుకోవాలని కోరుతూ సిద్ధరామయ్య బెంగళూరు కోర్టును ఆశ్రయించారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్: హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి ‘క్యూర్’ ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

రేకుల షెడ్డు కింద చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్

అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్డు కింద చదువుకుంటున్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలంలోని ఓ పాఠశాలలో సరైన భవన సదుపాయం లేదు. దీంతో అక్కడి విద్యార్థులు ఓ తాత్కాలిక రేకుల షెడ్డు కింద కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ హృదయవిదారక దృశ్యాలను ఓ యువకుడు వీడియో తీసి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎ’ (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో కొద్ది సమయంలోనే వైరల్‌గా మారి, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఈ పోస్ట్‌పై స్పందించిన మంత్రి నారా లోకేశ్, సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్..
మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను అమలు చేయకపోవడం వల్లే పదేపదే పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో జరిగిన సిగాచీ ప్రమాదం నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు ఫొటోలకు పోజులివ్వడానికి వస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన 54 కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు.

62 ఏళ్ల అమిత్ షా: డయాబెటిస్‌పై విజయం..
ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఇదే!

ఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న 62వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య ప్రస్థానానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్నేళ్లుగా తన జీవనశైలిలో మార్పులు చేసుకుని, 20 కిలోలకు పైగా బరువు తగ్గడమే కాకుండా, డయాబెటిస్‌ను కూడా నియంత్రణలో ఉంచుకున్నారు. ఆయన అనుభవాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి. 2020 మేలో తన జీవనశైలిని మార్చుకోవడం ప్రారంభించినట్లు అమిత్ షా గతంలోనే తెలిపారు. ఈ మార్పుల ఫలితంగా ఆయన ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడింది. 2025 ఏప్రిల్ లో న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో షా తన ఆరోగ్య రహస్యాలను పంచుకున్నారు. సరైన నిద్ర షెడ్యూల్ పాటించడం, రోజూ తగినన్ని నీళ్లు తాగడం, ఆహారంలో మార్పులు చేసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి నాలుగు సూత్రాలు తన జీవితాన్ని మార్చాయని ఆయన వివరించారు. ఈ మార్పుల వల్లే తాను గత నాలుగున్నరేళ్లుగా డయాబెటిస్ కోసం ఎలాంటి అల్లోపతి మందులు లేదా ఇన్సులిన్ వాడటం లేదని స్పష్టం చేశారు. ఈ అనుభవంతోనే యువతకు ఆయన కీలక సలహా ఇచ్చారు. ప్రతీరోజూ శరీరం కోసం రెండు గంటలు వ్యాయామానికి, మెదడు కోసం ఆరు గంటలు నిద్రకు కేటాయించాలని సూచించారు. ఈ దినచర్య వల్ల తన పని చేసే సామర్థ్యం, ఆలోచనా శక్తి, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం ఎంతో మెరుగుపడ్డాయని అమిత్ షా పేర్కొన్నారు. అయితే, వైద్య నిపుణులు ఈ విషయంలో కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తు చేస్తున్నారు. డయాబెటిస్ నియంత్రణ అనేది వ్యక్తికి వ్యక్తికి మారుతుందని, వైద్యుల పర్యవేక్షణ లేకుండా మందులను మార్చడం గానీ, మానేయడం గానీ అత్యంత ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో బరువు తగ్గడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయులు మెరుగుపడే అవకాశం ఉన్నప్పటికీ, ఫలితాలు అందరిలో ఒకేలా ఉండవని, నిరంతర వైద్య పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి: ప్రభుత్వ విప్ బొండా ఉమ

అమరాతి: రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ ‘క్రిమినల్ లిటిగెంట్’గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. “నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి” అని ఆయన పేర్కొన్నారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. “పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు” అని విమర్శించారు. సొంత బాబాయిని హత్య చేయించి, ‘నారాసుర రక్తచరిత్ర’ పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు..
పోలింగ్ తేదీ మారనుందా?

అమరావతి: ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ రెండు రోజులు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. నవంబరు 3న జరగాల్సిన పోలింగ్‌ను 5వ తేదీకి మార్చాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఒకట్రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌ను ఈ నెల 28 నుంచి నవంబరు 1కి ఎస్ఈసీ వాయిదా వేసింది. నవంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టాలని నిర్ణయించింది. ఇదే రోజున ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కూడా జరగాల్సి ఉంది. మున్సిపల్ ఓట్ల లెక్కింపు, పరిషత్ ఎన్నికల పోలింగ్ ఒకేరోజు నిర్వహిస్తే పోలీసు బందోబస్తు, ఎన్నికల సిబ్బంది కేటాయింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని ఎస్ఈసీ భావిస్తోంది. ఈ అంశంపై గురువారం చర్చించింది. పోలింగ్‌ను నవంబరు 5కి మార్చడం సముచితమని పోలీసు ఉన్నతాధికారులు కూడా అభిప్రాయపడినట్లు తెలిసింది. దీనిపై మరోసారి చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీ భావిస్తోంది. అయితే పోలింగ్ తేదీ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వై ఎస్ ఆర్ కడప జిల్లా
శనివారం - 24 - అక్టోబర్ - 2026

రాయవరం ఎంపీటీసీ అభ్యర్థిగా సుమలత రెండో సెట్ నామినేషన్ దాఖలు

సుండుపల్లి, మహిన్యూస్, అక్టోబర్ 23 : సుండుపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాయవరం గ్రామ పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నాయకుడు శివ బాలయ్య సతీమణి సుమలత రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ నాయకుడు, మహేష్ నాయుడు, రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తుమ్మల రవి శంకర్, మద్దిరాల రవిశంకర్, కట్ట రమేష్ బాబు, శివ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోనూ మున్సిపల్ నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు..!

కడప, రాజంపేట, మైదుకూరు అభ్యర్థులకు అవకాశం

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ అక్టోబరు 23 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు.. అర్బన్ లోకల్ బాడీ ఎన్నికలకు సంబంధించి.. కడప నగరపాలక సంస్థ, రాజంపేట, మైదుకూరు పురపాలక సంఘాల్లోని నిర్దేశిత వార్డులకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. అక్టోబరు 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్ణయించిన ఆయా మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లోనూ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించవచ్చని తెలిపారు.

కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు..

కడప నగరపాలక సంస్థ : కలెక్టరేట్‌లోని సభాభవన్
రాజంపేట పురపాలక సంఘం : కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు
మైదుకూరు పురపాలక సంఘం : కలెక్టరేట్‌లోని ప్రజా పీజీఆర్ఎస్ హాలు

నిర్దేశించిన మున్సిపాలిటీలోని సంబంధిత వార్డుల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, నిర్ణీత తేదీలు, సమయాల్లో తమ నామినేషన్ పత్రాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేయండి

జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ కడప జిల్లా

కడప మహి న్యూస్ అక్టోబర్ 23: జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెపిటీసీ), మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసి) ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగేందుకు జిల్లా ఎస్పీ గారికి తగిన సూచనలు జారీ చేయడంతో పాటు, అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉదయం నుంచే ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, నిర్భయంగా వెంటనే జిల్లా పరిషత్ కార్యాలయంలోని సంబంధిత నామినేషన్ కేంద్రానికి చేరుకుని తమ నామినేషన్లను దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. అదేవిధంగా, జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. నామినేషన్ పత్రాలను నింపడం, అవసరమైన సమాచారం పొందడం తదితర అంశాల్లో అభ్యర్థులకు సహాయం అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ప్రతి అర్హత కలిగిన అభ్యర్థి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటూ, ఎలాంటి ఒత్తిళ్లకు లేదా భయాలకు లోనుకాకుండా నామినేషన్లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ..!

కడప, మహి న్యూస్ అక్టోబరు 23: జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చివరి రోజు ప్రక్రియను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.

ప్రశాంతంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ...

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

అభ్యర్థులకు భద్రత కల్పించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 23: వైఎస్సార్ కడప జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ చివరి రోజైన శుక్రవారం ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు... జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్యాలయ ప్రాంగణంతో పాటు నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్లు, 500 మీటర్ల పరిధుల్లో భద్రతను కట్టుదిట్టం చేశామని, తగినంత మంది పోలీసు సిబ్బందిని నియమించామని తెలిపారు. కేంద్రాల వెలుపల నిరంతరం గస్తీ నిర్వహిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. కడప, రాజంపేట, మైదుకూరు ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన పోలీసు రక్షణ కల్పించి, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీసు నియంత్రణ గది నిరంతరం అందుబాటులో ఉంటుందని, అత్యవసర సహాయం కోసం 112 నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని అభినందించారు. ఇదే విధంగా ఎన్నికల తదుపరి ప్రక్రియలోనూ భద్రతా చర్యలను కొనసాగిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలి..!

నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల వరకు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 23 : జిల్లాలో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను నిబంధనల మేరకు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రిటర్నింగ్ అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన తదితర ప్రక్రియలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనల మేరకు అభ్యర్థితో పాటు అనుమతించిన ఇద్దరినే నామినేషన్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. నిర్ణీత గడువులోపు నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ప్రక్రియ పూర్తిచేసే అవకాశం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎస్‌టీ, ఎస్-ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ బృందాలు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బ్యాలెట్ పెట్టెల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, సంబంధిత ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, ప్రశాంత వాతావరణం ప్రధానమని పేర్కొంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు..!

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప కార్పోరేషన్, మైదుకూరు, రాజంపేట మున్సిపల్ నామినేషన్ల ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి..!

కడప, మహి న్యూస్ అక్టోబరు 23 : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణను సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మూడు కేంద్రాల్లో కడప నగరపాలక సంస్థ, మైదుకూరు, రాజంపేట పురపాలక సంఘాల పరిధిలోని నిర్దేశిత వార్డులకు జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల్లోని ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, నామినేషన్ల స్వీకరణ తీరును సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిర్దేశిత వార్డులకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం...

కడప నగరపాలక సంస్థ, రాజంపేట, మైదుకూరు పురపాలక సంఘాల పరిధిలోని నిర్దేశిత వార్డులకు అక్టోబరు 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కడప నగరపాలక సంస్థలో 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55వ వార్డులకు, రాజంపేట పురపాలక సంఘంలో 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27వ వార్డులకు నామినేషన్ల గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. మైదుకూరు పురపాలక సంఘంలోని మొత్తం 32 వార్డులకు కూడా ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో మూడు ప్రత్యేక కేంద్రాలు...

కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో కడప నగరపాలక సంస్థకు, వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజంపేట పురపాలక సంఘానికి, ప్రజా పీజీఆర్ఎస్ హాలులో మైదుకూరు పురపాలక సంఘానికి సంబంధించిన నామినేషన్లు సమర్పించవచ్చని తెలిపారు. ఆయా పురపాలక సంస్థల్లో ఇప్పటికే నిర్దేశించిన కేంద్రాల్లోనూ నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని అధికారులకు సూచించారు. నిర్ణీత తేదీలు, సమయాల్లో అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు...

నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

మూడు పురపాలక సంస్థల్లో అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ..!

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

ప్రశాంతంగా జెడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్లు...

కడప, మహి న్యూస్ అక్టోబర్ 23: వైఎస్సార్ కడప జిల్లాలోని కడప నగరపాలక సంస్థ, రాజంపేట, మైదుకూరు పురపాలక సంఘాల్లోని నిర్దేశిత వార్డులకు నామినేషన్ల దాఖలుకు అదనపు అవకాశం కల్పిస్తూ గడువును పొడిగించడంతో.. కడపలో 11 వార్డులు, రాజంపేటలో 11 వార్డులు, మైదుకూరులో 32 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ సజావుగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

శుక్రవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తోకలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా.. రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్దేశించిన జిల్లాలోని మూడు పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 24వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లోనూ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, అక్కడ కూడా పలువురు అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్లు సమర్పించినట్లు పేర్కొన్నారు. గతంలో నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన అభ్యర్థులందరికీ ఈ అవకాశం కల్పించామని, వారు గడువులోగా నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

ప్రశాంతంగా జెడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్లు...

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను కూడా ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, మరికొందరు నామినేషన్లు సమర్పిస్తున్నారని వెల్లడించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహాయం కోరిన అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎవరైనా అభ్యర్థులకు భద్రతాపరమైన ఆందోళనలు ఉంటే పోలీసు నియంత్రణ గదిని సంప్రదించాలని సూచించారు. నామినేషన్ కేంద్రానికి చేరుకునే వరకు అవసరమైన సహాయం, భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశామని పేర్కొన్నారు. జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మిగిలిన ప్రక్రియలు కూడా సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

చెస్‌లో గౌతమ్ స్కూల్ విద్యార్థుల జిల్లా స్థాయి కి ఎంపిక

గాలివీడు: అక్టోబర్23(మహి న్యూస్): మండల కేంద్రంలో నీ గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు చెస్‌లో ప్రతిభ కనబరిచి రాయచోటి నియోజకవర్గ అండర్-14 చెస్ ఛాంపియన్స్‌గా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన కె. కౌటిలేశ్వర్ రెడ్డి, ఏ. సహానాలు అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ఛాంపియన్స్‌గా నిలిచారు. వీరిద్దరూ తదుపరి జరిగే జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమ్మానెయిల్ విద్యార్థులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం పాఠశాలకు గర్వకారణమని వారు తెలిపారు. విద్యార్థులు జిల్లా స్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

జమ్మలమడుగులో కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

9, 10, 11, 15వ వార్డుల్లో ప్రజలతో మమేకం

కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 23: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 9, 10, 11, 15వ వార్డులలో (కన్నెలూరు) మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు రామసుబ్బమ్మ, జంబాపురం రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బిర్రు గుర్రప్ప, నవనీశ్వర్ రెడ్డి, శివ రామలింగారెడ్డి, కిషోర్, మునిస్వామి, ప్రశాంత్, వార్డు కౌన్సిలర్లు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతం

అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా ఏర్పాట్లు

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

అభ్యర్థులను అడ్డుకున్నా, బెదిరించినా ఉపేక్షించేది లేదు

నామినేషన్ల దాఖలుకు పోలీసు రక్షణ కల్పిస్తాం

నరసరావుపేట, అక్టోబర్ 23: (మహి న్యూస్): పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న కేంద్రాలను జిల్లా ఎస్పీ జగదీష్‌తో కలిసి ఆమె విస్తృతంగా పరిశీలించారు. ఈ

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకోవచ్చని తెలిపారు. ఎవరైనా అభ్యర్థులను అడ్డుకున్నా, బెదిరించినా లేదా ఇబ్బందులకు గురిచేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటున్నట్లు ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి, గడువు ముగిసే శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. అవసరమైతే పోలీసు రక్షణ కూడా కల్పిస్తామని చెప్పారు. అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రంలో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తామని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గుంపులుగా గుమిగూడి అల్లర్లు సృష్టిస్తే పోలీసు చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసు రక్షణ కోరిన అభ్యర్థులందరికీ తగిన భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు స్వేచ్ఛగా చేరుకునేలా పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. అవసరమైతే ఎస్కార్ట్ వాహనాల ద్వారా నామినేషన్ కేంద్రాలకు తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉందని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులను బెదిరించడం, నామినేషన్ల దాఖలుకు ఆటంకాలు కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

మాచర్లలో టీడీపీ అభ్యర్థులు 13వ వార్డులో విస్తృత ప్రచారం

మాచర్ల, అక్టోబర్ 22:(మహి న్యూస్): మాచర్ల అభివృద్ధి ప్రదాత, పల్నాటి పులి జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఏనుముల కేశవరెడ్డి సతీమణి ఏనుముల సుష్మా రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చల్ల నాగమణిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 13వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మమేకమై, ఎన్డీఏ కూటమి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటును తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జంధ్యాల సత్యనారాయణ, వార్డు నాయకురాలు వేముల మంగమ్మ, మల్లెల శివ, బత్తుల చెన్నతో పాటు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు. 10వ వార్డు, 68వ బూత్ ఇన్‌చార్జ్ షేక్ జానీ భాష తదితరులు పాల్గొన్నారు

కారంపూడిలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు, ఉచిత ఆయుష్ వైద్య శిబిరం

పల్నాడు జిల్లా కారంపూడి అక్టోబర్ 23 :(మహి న్యూస్): పల్నాడు జిల్లా కారంపూడి మండలంలోని డాక్టర్ ఆదినారాయణ కాలనీలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సుతో పాటు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. దినచర్య, ఋతుచర్యలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు అనుకూలంగా యోగా, ప్రాణాయామం, ధ్యానం క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. వైద్య శిబిరంలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారితో పాటు వృద్ధులు, మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, కీళ్లవాతం, ఉదరశూల, మహిళల ఆరోగ్య సమస్యలు తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. కాలనీ పెద్దలు కోటేశ్వరరావు, బక్క సాంబయ్య మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయుర్వేద వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌కు కాలనీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ లాలూ నాయక్, ఏఎన్ఎం ఈశ్వరి, ఆశా కార్యకర్తలు, కాలనీ పెద్దలు అనంతలక్ష్మి, సామ్రాజ్యం, కోటయ్య, రమణమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి సుష్మ కేశవరెడ్డి పర్యటన

మాచర్ల (మహి న్యూస్) అక్టోబర్ 23 : మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిన్న 18, 19, 20, 21 వార్డులలో టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డి పర్యటించారు. వారికి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్యాగంటి మల్లికార్జున రావు సాదర స్వాగతం పలికి, వెంట ఉండి ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ యాగంటి మల్లికార్జున రావు మాట్లాడుతూ, టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డి ని మరియు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులను సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు 18వ వార్డు మదిగపు శ్రీనివాసరెడ్డి 19వ వార్డు బండ్ల అనురాధ 20వ వార్డు పోలా సత్యం 21వ వార్డు కొప్పుల శివ మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని, ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి అందిస్తారని, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నారని, త్వరలో బుగ్గ వాగు నుండి మంచినీటి సరఫరా అందుతుందని తెలిపారు. కావున టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే మాచర్ల పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని యాగంటి మల్లికార్జున రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లకు ఆటంకాలు కలిగిస్తే తక్షణమే పోలీసులను సంప్రదించండి

నామినేషన్ల దాఖలుకు నేడు సాయంత్రం 5 గంటల వరకు అవకాశం

అభ్యర్థులకు పోలీసు సహకారం అందిస్తాం

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ

గుంటూరు, అక్టోబర్ 23: (మహి న్యూస్): ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. నామినేషన్ల దాఖలులో ఎక్కడైనా ఆటంకాలు, సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టర్ లేదా పోలీసు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురైతే పోలీసు శాఖ సహకారం అందిస్తుందని తెలిపారు. ఎవరైనా అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నా, ఇతర కారణాలతో నామినేషన్లు వేయలేకపోయినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన అభ్యర్థులు అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన పోలీసు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. నామినేషన్లకు సంబంధించి సమస్యలు ఎదురైతే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు కింది మార్గాల్లో పోలీసులను సంప్రదించవచ్చు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం: 8688831390 ్న డయల్ 112: అత్యవసర పోలీసు సహాయం ్న సమీప పోలీస్ స్టేషన్‌ను నేరుగా సంప్రదించవచ్చు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఎన్నికల వేళ అక్రమ మద్యంపై ఉక్కుపాదం

మాచర్ల నియోజకవర్గంలో స్పెషల్ డ్రైవ్‌లు..

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీలు

మాచర్ల (మహి న్యూస్) అక్టోబర్ 23 : మాచర్ల నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నాటుసారా కార్యకలాపాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా అధికారులు ప్రత్యేక రూట్ వాచ్‌లు నిర్వహిస్తూ, స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తున్నారు. నియోజకవర్గ సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణా, ఇతర ఎక్సైజ్ నేరాలపై తనిఖీలు చేపడుతున్నారు. గతంలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన పాత నిందితుల కదలికలపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు, నాటుసారా తయారీ లేదా రవాణా వంటి కార్యకలాపాలు గుర్తించినట్లయితే ప్రజలు వెంటనే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అక్రమ మద్యం, నాటుసారా వ్యాపారాలకు పాల్పడేవారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమ మద్యం ప్రభావాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని తెలిపారు.

పోలీసులకు సెల్యూట్.. నామినేషన్‌కు సహకరించిన పల్నాడు పోలీసులకు కృతజ్ఞతలు

పల్నాడు జిల్లా, మాచర్ల అక్టోబర్ 23:(మహి న్యూస్): మాచర్ల జెడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు నరసరావుపేటకు వచ్చిన తనకు పోలీసు శాఖ అండగా నిలిచిందని మాచర్ల మండలానికి చెందిన పెద్దిరాజు తెలిపారు. నరసరావుపేటలో చోటుచేసుకుంటున్న కొన్ని పరిణామాలతో తాను భయాందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆయన స్పందించి ఒక సీఐని తనకు తోడుగా పంపించారని తెలిపారు. పోలీసుల సహకారంతో తాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్ దాఖలు చేయగలిగానని వెల్లడించారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం తాను తిరిగి వెళ్లేందుకు కూడా పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు పెద్దిరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమయస్ఫూర్తితో స్పందించి తనకు సహకరించిన జిల్లా ఎస్పీ జగదీష్‌తో పాటు పల్నాడు జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ వంతు సహకారం అందించిన పోలీసు అధికారులకు పెద్దిరాజు సెల్యూట్ చేశారు.

పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పల్నాడు జిల్లా,మాచర్ల అక్టోబర్ 23: (మహి న్యూస్) : మాచర్ల,పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మాస్టర్ శిక్షకుడి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 170 మంది పోలింగ్ సిబ్బందికి పోలింగ్ ప్రక్రియ, ఎన్నికల విధులు, ఓటరు ధ్రువీకరణ యంత్రం వినియోగం, ఎన్నికల నిబంధనలు, ఓటింగ్ నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీవో ఇ. మురళీకృష్ణ పరిశీలించి, పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధులను నిష్పాక్షికంగా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరిస్తూ, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం

కారంపూడి అక్టోబర్ 23: (మహి న్యూస్): కారంపూడి పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పల్నాడు జిల్లా కారంపూడి పోలీస్ స్టేషన్‌లో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ డైరెక్టర్ రోనాంగి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు సాధారణ ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ వాసు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య విధానం ప్రాధాన్యతను వివరించారు. వైద్యుల సూచనల మేరకు మందులను వినియోగించుకోవాలని తెలిపారు. వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ ఆర్. శ్రీనివాస్‌తో పాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది సురేష్, శ్రీనివాస్, వెంకటరమణ, రామకృష్ణ, మస్తాన్‌వలి, హెల్త్ సూపర్‌వైజర్ లాలూ నాయక్, హెల్త్ అసిస్టెంట్, యోగా ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది

ఇప్పటివరకు జడ్పీటీసీకి 65, ఎంపీటీసీకి 768 నామినేషన్లు దాఖలు

అభ్యర్థులకు అవసరమైతే పోలీసు రక్షణ

నామినేషన్ దాఖలుకు అందరికీ సమాన అవకాశాలు

నరసరావుపేట, అక్టోబర్ 23: (మహి న్యూస్): పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. ఇప్పటివరకు జడ్పీటీసీ స్థానాలకు 65, ఎంపీటీసీ స్థానాలకు 768 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్షతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, గురువారం కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగినట్లు సమాచారం రావడంతో పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. పోలీసుల రక్షణతో అభ్యర్థులను నామినేషన్ కేంద్రాలకు తీసుకువచ్చి నామినేషన్లు దాఖలు చేయించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కూడా మాచర్ల నుంచి వచ్చిన అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులను పోలీసు రక్షణతో నామినేషన్ కేంద్రాల్లోకి తీసుకెళ్లి నామినేషన్లు దాఖలు చేయించినట్లు తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు స్వేచ్ఛగా, నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. ఎవరైనా అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురైతే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని ఫోన్ ద్వారా సంప్రదించి పోలీసు రక్షణ కోరవచ్చని తెలిపారు. ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం అందించినా నామినేషన్ దాఖలు చేసేందుకు పోలీసు రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మండల స్థాయి ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులకు కూడా తెలియజేసినట్లు చెప్పారు. అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రంలో అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీతో మాట్లాడినట్లు పేర్కొంటూ, అవసరమైన అభ్యర్థులను పోలీసు ఎస్కార్ట్ వాహనాల్లో నామినేషన్ కేంద్రాలకు తీసుకెళ్లి సహకరిస్తామని వెల్లడించారు. గురువారం గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను పోలీసు ఎస్కార్ట్‌తో నామినేషన్ కేంద్రాలకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అభ్యర్థులు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు.

శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ శుక్రవారం సాయంత్రం సతీసమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన కమిషనర్ దంపతులకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దంపతులు సాయంత్రం వేళ అత్యంత వైభవంగా జరిగిన పంచహారతుల సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేదోక్తంగా ఆశీర్వచనం చేయగా, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ శ్రీ అమ్మవారి శేషవస్త్రం,ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేసారు.

శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్ బన్సల్...

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 23: భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్ బన్సల్, శుక్రవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వీరికి ఆలయ రాజగోపురం ముంగిట దేవస్థాన అధికారులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో శ్రీకనక దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆయనకు వేదోక్తంగా ఆశీర్వచనం చేయగా, దేవస్థాన అధికారులు అమ్మవారి శేషవస్త్రం , ప్రసాదాలు మరియు శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని అందజేసారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com